





# తెలంగాణ ఫలం.. సాగు జలం..

## కేసీఆర్ జలవిజయాలను ఆవిష్కరించిన ఆర్బీఐ నివేదిక


### బీఆర్ఎస్ హయాంలో ప్రాధాన్య క్రమంలో శరవేగంగా ప్రాజెక్టులు • పెండింగ్ ప్రాజెక్టులన్నీ రన్నింగ్!

ఆర్బీఐ నివేదిక ప్రకారం.. పంటల సాగు విస్తీర్ణం... (కోట్ల ఎకరాల్లో)




సాగు విస్తీర్ణం పెరుగుదల 98 లక్షల ఎకరాలు (74.8%)


ఆర్బీఐ నివేదిక ప్రకారం సాగునీటి పారకం (లక్షల ఎకరాల్లో)




పెరిగిన సాగు పారకం 97.48 లక్షల ఎకరాలు (155.99%)

**స్వరాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యదక్షత, దూరదృష్టితో తొమ్మిదిన్నరేండ్లలోనే తెలంగాణ జలమాగాణంగా మారిపోయింది. ప్రాజెక్టుల రీ ఇంజినీరింగ్, రీ డిజైన్‌తో తెలంగాణ సాగునీటి రంగంలో నవశకం మొదలైంది. మండువేసవిలోనూ చెరువులు మత్తళ్లు దుంకుతున్న అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. పాతాళ గంగమ్మ పైపైకి ఉబికివస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి జలాల నుంచి 90 టీఎంసీలను కూడా పూర్తిస్థాయిలో వాడుకోలేని పరిస్థితి నుంచి గరిష్ఠంగా 400 టీఎంసీలకుపైగా వినియోగించుకునే స్థాయికి ఎదిగామంటే కేసీఆర్ హయాంలో సాధించిన ప్రగతిని అర్థం చేసుకోవచ్చు.**

హైదరాబాద్, డిసెంబర్18 (నమస్తే తెలంగాణ): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా కాకతీయ కాల్వ చివరి భూముల వరకు గోదావరి జలాలు పుష్కలంగా అందుతున్నాయి. మరోవైపు, కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను సైతం ప్రాధాన్య క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. ఒక్క పాలమూరు జిల్లాలోనే నాలుగు ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో ఎనిమిది లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగునీరు అందుతున్నది. కోయిల్‌సాగర్ ద్వారా 50,250 ఎకరాలకు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 3.65 లక్షల ఎకరాలకు జీవం వచ్చింది. భీమా ద్వారా 2.03 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు కింద మరో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. తద్వారా ఈ నాలుగు ప్రాజెక్టుల ద్వారానే 8 లక్షల ఎకరాలకుపైగా బీడు భూములకు జీవం వచ్చింది. ప్రాజెక్టులను ఆధునిక సాంకేతిక టెక్నాలజీ దన్నుతో నిర్వహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు తుది దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను, మొబైల్ యాప్‌లను వస్సార్ ల్యాబ్స్ ఇప్పటికే రూపొందించింది. తద్వారా పంప్‌హౌజ్‌లు, జలాశయాలు, కాలువలు, చెరువులు, వర్షపాతం వివరాలు, నదుల ఇన్‌ఫ్లో, భూగర్భ జలాల పరిస్థితి తదితర సమస్త సమాచారం అంతా ఒకేచోట లభ్యం కావడంతోపాటు నదుల్లోకి వచ్చే, కిందికి విడుదల చేసే నీటి పరిమాణాన్ని అంచనా వేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఈ సిస్టమ్‌లో పొందుపరిచారు. జలాశయాలు, చెరువుల్లో ఎంత నీరు ఉన్నది? ఎంత ఖాళీ ఉన్నది? అన్న సమాచారాన్ని కూడా దీని ద్వారా తెలుసుకునే అవకాశం కలగనున్నది.



## కోటి ఎకరాలకు పెరిగిన సాగు

**రాష్ట్రంలో 2014-15తో పోల్చితే తొమ్మిదిన్నరేండ్లలో పంటల సాగు భారీగా పెరిగినట్టు ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. సుమారు 74.8% పెరుగుదలతో పంటల సాగు విస్తీర్ణం 98 లక్షల ఎకరాలు పెరిగినట్టు వివరించింది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ అతి తక్కువ కాలంలో ఇంత భారీ విస్తీర్ణంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగిన దాఖలాలు లేవు.**

ఆర్బీఐ లెక్కల ప్రకారం 2014-15లో రాష్ట్రంలో 1.31 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా, 2022-23లో 2.29 కోట్ల ఎకరాలకు పెరిగింది. కేసీఆర్ ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ నేతలు చేసిందంతా దుష్ప్రచారమేనని ఆర్బీఐ నివేదికతో రూఢీ అయింది. ఆర్బీఐ నివేదిక ప్రకారం తొమ్మిదన్నరేండ్లలో సాగు నీటి పారకం 156% పెరిగింది. 2014-15లో కేవలం 62.49 లక్షల ఎకరాలకు నీటి పారకం ఉండగా, 2022-23లో 159.97 లక్షల ఎకరాలకు పెరిగింది. నాటి సీఎం కేసీఆర్ సాగునీటి గోస తీర్చడమే లక్ష్యంగా రూ.1,64,210 కోట్లు వెచ్చించి కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టులను పూర్తి చేశారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువులకు పూర్వవైభవం తీసుకొచ్చారు. ఫలితంగా ప్రాజెక్టుల వల్ల 17.23 లక్షల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందగా, భూగర్భ జలాలు పెరగడంతో మొత్తంగా 98 లక్షల ఎకరాలు కొత్తగా సాగునీరు అందడం గమనార్హం

## తెలంగాణ ఏర్పాటు తర్వాత పూర్తి చేసిన పెండింగ్ ప్రాజెక్టులు

**గోదావరి బేసిన్:** ఎల్లంపల్లి, మిడ్‌మానేరు జలాశయం, శ్రీరాంసాగర్ రెండోదశ, శ్రీరాంసాగర్ వరద కాలువ, బాగారెడ్డి సింగూరు కాలువలు, కుమ్రంభీం, కిన్నెరసాని కాలువలు, గొల్లవాగు, మత్తడివాగు, పాలెంవాగు, ర్యాలివాగు, గడ్డెన్నసుద్దవాగు, చౌటుపల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం, గూడెం ఎత్తిపోతల పథకం, బేతుపల్లి వరద కాలువ, గట్టు పొడిచిన వాగు, సమ్మక్కసాగర్ బ్యారేజి (తుపాకులగూడెం)

**కృష్ణా బేసిన్:** జూరాల కాలువలు, కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్‌భీమా, కోయిల్‌సాగర్


**తెలంగాణ ఏర్పాటు తరువాత మొదలుపెట్టి పూర్తిచేసిన ప్రాజెక్టులు:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, చనాకా కొరాట బరాజ్, సమ్మక్క-సారక్క బరాజ్, భక్త రామదాసు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఇలా..

- ఇరిగేషన్ ప్రాజెక్టులకు వెచ్చించిన నిధులు రూ.38,405.12 కోట్లు
- 2004-14 వరకు వచ్చిన ఆయకట్టు 5.71 లక్షల ఎకరాలు
- ఉమ్మడి ప్రభుత్వం పూర్తి చేసి, సాగునీటిని అందించిన భారీ ప్రాజెక్టులు ఒక్కటి కూడా లేవు.
- చిన్నలిఫ్టులు, ఐడీసీ పథకాలు పనిచేయని దుస్థితి
- బుంగలు పడితే తప్ప చెరువుల మరమ్మతు చేపట్టింది లేదు.
- 56.86 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించినట్టు కాగితాలపై లెక్కలేసినా వాస్తవంగా అందింది 20 లక్షల ఎకరాలకే.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత..

- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులపై వెచ్చించిన మొత్తం రూ.1,64,210 కోట్లు
- పదేండ్లలో పెరిగిన సగటు భూగర్భ జలమట్టం సగటున 4.14 మీటర్లు
- 2014-2023 నాటికి సాగులోకి తీసుకొచ్చిన ఆయకట్టు 17.23 లక్షల ఎకరాలు
- వివిధ ప్రాజెక్టుల కింద స్థిరీకరించిన మొత్తం ఆయకట్టు 31.5 లక్షల ఎకరాలు
- తెలంగాణ ప్రభుత్వం మూడు భారీ ప్రాజెక్టులను చేపట్టింది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. కాళేశ్వరం కింద 18.83 లక్షల ఎకరాలను స్థిరీకరణ చేయగా, 19.63 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు ఉన్నది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసింది. దీని కింద 12.30 లక్షల ఎకరాలు ఉన్నది. సీతారామ ఎత్తిపోతల పథకం పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టు కింద కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కలుపుకొని మొత్తంగా 8.17 లక్షల ఎకరాలు ఉన్నది.
- 27,325 చెరువులను మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించింది. దాదాపు 9.61 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది.
- రూ.316.67 కోట్లు వెచ్చించి కాలువలు, తూముల మరమ్మతులను నిర్వహించింది.
- రూ.3,850 కోట్లతో 1,200 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. అందులో 638 చెక్‌డ్యామ్‌లను పూర్తి చేసింది. తద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా లభించడంతోపాటు స్థానికంగా భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి.
- తెలంగాణ పదేండ్లలో చేపట్టిన ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో నేడు తెలంగాణలో 1.03 కోట్ల ఎకరాలకు సాగునీరు అందుతున్నది.



### మిషన్‌కాకతీయ

మొత్తం చెరువులు **27,625** | పునరుద్ధరించినవి **21,436**

ఖర్చు **9,155.97** కోట్లు

తొలగించిన పూడిక **2384.35** లక్షల క్యూబిక్ మీటర్లు | పునరుద్ధరించిన నీటి నిల్వ సామర్థ్యం **9.61** టీఎంసీలు

ఆయకట్టు స్థిరీకరణ **15.05** లక్షల ఎకరాలు

చెరువుల కింద కొత్తగా సాగులోకి వచ్చిన ఆకకట్టు **1.05** లక్షల ఎకరాలు

165 చిన్న నీటి ఎత్తిపోతల పథకాల కింద కొత్తగా **1.23** లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం

## మిషన్‌కాకతీయ.. వాగుల పునరుజ్జీవ పథకం

**తెలంగాణ** ప్రాంత నీటి వనరులకు ఆయువుపట్టయిన చెరువుల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి పెట్టిన కేసీఆర్ ప్రభుత్వం.. మిషన్‌కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 46,500 చెరువులను దశలవారీగా పునరుద్ధరించాలని నిర్ణయించి, ఇప్పటికే నాలుగు దశల్లో 21,436 చెరువులను పునరుద్ధరించింది. నీటిని ఒడిసిపట్టేందుకు, వృథాను అరికట్టేందుకు వీలుగా వాటిని తీర్చిదిద్దించింది. మరమ్మతులు చేపట్టి, కొత్త తూములను నిర్మించింది. ఫలితంగా 15.05 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కొత్తగా 1.05 లక్షల ఎకరాలు సాగుకిందకు వచ్చాయి. చెరువుల్లోనే 9.61 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. ప్రతి వర్షపుబొట్టును ఒడిసి పట్టాలనే సంకల్పంతో రాష్ట్రంలోని అన్ని వాగులపై కలిపి సుమారు 1,200 చెక్‌డ్యామ్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాగుల పునరుజ్జీవ పథకం కింద కృష్ణ బేసిన్‌లోని వాగులపై 188, గోదావరి బేసిన్‌లో వాగులపై 444 చెక్‌డ్యామ్‌లను నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది.

### వాగుల పునరుజ్జీవ పథకం

నిర్మించాల్సిన చెక్‌డ్యామ్‌లు మొత్తం **1,200**

మొదటి ఫేజ్: **635,** నిధులు రూ.**1,975** కోట్లు

సెకండ్ ఫేజ్: **585** నిధులు: రూ.**1,850** కోట్లు

ఫస్ట్ ఫేజ్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 400 చెక్‌డ్యామ్‌లు పూర్తయ్యాయి. మిగతావి 80% పూర్తయ్యాయి.

సెకండ్ ఫేజ్ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి.



### మేజర్ ప్రాజెక్టుల కింద రెండు సీజన్లకు కలిపి నీటి వినియోగం (టీఎంసీలలో..)

గోదావరి బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టులు..

| ప్రాజెక్టు | 2000-2014 వరకు సగటు వినియోగం | ప్రస్తుతం |
|---|---|---|
| ఎస్ఆర్ఎస్పీ స్టేజీ 1 | 103 | 148.39 |
| ఎస్ఆర్ఎస్పీ స్టేజీ 2 | ప్రారంభమే కాలేదు | 41.76 |
| మధ్యమానేరు | ప్రారంభమే కాలేదు | 10.54 |
| నిజాంసాగర్ | 10.94 | 21.2 |
| సింగూరు | 1.8 | 04 |
| దేవాదుల | 5.79 | 18.43 |
| ఎల్లంపల్లి | ప్రారంభమే కాలేదు | 30.3 |
| **కృష్ణా బేసిన్‌లో..** | | |
| జూరాల | 19.49 | 19.50 |
| ఆర్డీఎస్ | 05.65 | 9.50 |
| నాగార్జునసాగర్ లెఫ్ట్‌కెనాల్ | 123.81140.89 | |
| మూసీ | 03.5 | 06 |
| రాజీవ్‌భీమా | 0.56 | 20.67 |
| కోయిల్‌సాగర్ | 02.85 | 4.97 |
| **కృష్ణా వరద జలాలపై..** | | |
| కల్వకుర్తి | 0 | 52.89 |
| ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ | 0 | 47.56 |
| నెట్టెంపాడు | 0 | 14 |
| మొత్తం | 277.39 | 590.6 |



## బోరుబావులే మేజర్ ప్రాజెక్టు

**తెలంగాణ** రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రంలో మొత్తం సాగయిన భూమిలో 74% మేరకు బోరుబావుల కిందనే ఉండేది. కాలువల కింద 15%, చెరువులు, ఇతర వనరుల కింద 11% మాత్రమే ఉండేది. ఉమ్మడి రాష్ట్ర పాలకులు ప్రాజెక్టులు కట్టకపోవడం, చెరువులను విస్మరించడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడమే కాకుండా కరెంటు కోతలతో తెలంగాణ వ్యవసాయరంగం సంక్షోభానికి గురైంది. పదుల సంఖ్యలో, వందల అడుగుల్లో బోర్లు వేయడం, నీటి ఊట లేక అవి ఫెయిలవడమూ పరిపాటిగా మారింది. నీరున్న చోటైనా బావుల ద్వారా సాగుచేద్దామంటే కరెంటు ఉండేది కాదు. ఏ అర్ధరాత్రి వస్తుందో? ఎన్ని గంటలు ఉంటుందో? ఎప్పుడు పోతుందో? తెలియదు. ఎకరమో, అర ఎకరమో సాగు చేయడమే గగనంగా మారిపోయింది. రాష్ట్ర ఏర్పాటునాటికి తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 20 లక్షల బోరుబావులుండగా, వాటికింద సాగైంది 23 లక్షల ఎకరాలే. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన బహుముఖ జలసంరక్షణ చర్యల ఫలితంగా బోరుబావుల కింద కూడా వ్యవసాయం పండుగలా మారింది. మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రాజెక్టులతో చెరువుల అనుసంధానంతో తెలంగాణ అంతటా భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఉచితంగా 24 గంటలూ నాణ్యమైన కరెంటును అందించడంతో బోర్లు నిండుగా పోస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.1 కోట్ల ఎకరాలు సాగువుతుండగా, అందులో దాదాపు 45 లక్షల ఎకరాలు 30 లక్షల బోర్లు కిందనే సాగువుతున్నాయి.